సాక్షి
చిత్తూరు
శనివారం, 10, మే, 2025



ట్రస్టులకు విరాళం
కాణిపాకంలోని నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టులకు దాతలు శుక్రవారం నగదు విరాళాలు అందజేశారు. - 12లో



తక్షణం పీఆర్సీ కమిషన్ వేయాలి
తక్షణం 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని ఏపీ టీఎఫ్ 1947 జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్ చేశారు. - 12లో



క్రీడా సామగ్రి అందజేత
జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడా సామగ్రిని అందజేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తెలిపారు. - 12లో

న్యూస్‌రీల్

పంచాయతీలకు రూ.1.38 కోట్లు విడుదల
చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీలకు రాష్ట్ర గ్రాంట్‌గా తొలి త్రైమాసికానికి రూ.1.38 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తలసరి ఆదాయం(పర్‌క్యాపిటా) కింద రూ.15,05,785, వృత్తి పన్ను రూ.36,33,196, సర్పంచుల గౌర వేతనాలకు రూ. 86,95,992, లైబ్రరీ గ్రాంటు రూ.673 కలిపి రూ.1.38 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఆయా పంచాయతీల ఖాతాల్లో ఈ నెల 12, 13వ తేదీల్లో జమ చేయనున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి
జిల్లాలోని 26 మంది గ్రేడ్ -3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్- 2 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిని ఖాళీలున్న గ్రేడ్ -2 గ్రామ పంచాయతీల్లో నియమించనున్నట్లు పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛ హరణ ఆటవిక చర్య


దేవేంద్రరావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం ఆటవిక చర్య అని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మల్రిపూడి దేవేంద్రరావు స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సాక్షి దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వమండా పోలీసులు సోదాలు చేయడం నీతిమాలిన చర్య అని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగమైన ఒక స్తంభాన్ని కూల్చేయాలనుకుంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే సాక్షి దినపత్రికపై కక్ష సాధింపు చర్యలకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా రాష్ట్ర గవర్నర్ చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఏదో జరిగింది..!

- స్పెషల్ బ్రాంచ్ సీఐ.. ఎంటీఓపై బదిలీ వేటు
- ఇద్దరికీ పోస్టింగులు ఇవ్వని యంత్రాంగం
- బదిలీలపై చిత్తూరు పోలీసుశాఖ సర్వత్రా చర్చ
- 'సూపర్ బాస్'గా దూసుకెళ్లడమే కారణమా?

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో జరుగుతున్న పరిణామాలపై ఆ శాఖలో విస్తృత చర్చ నడుస్తోంది. ప్రధానంగా ఏ ఇద్దరు ఖాకీలు ఒక చోట కలిసినా ఇటీవల పోలీసుశాఖలో చోటు చేసుకుంటున్న బదిలీలపై మాట్లాడుకుంటున్నారు. తాజాగా స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేస్తున్న భాస్కర్, మోటారు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (ఎంటీఓ) భాస్కర్‌పై బదిలీ వేటు పడింది. వీరిద్దరూ ఏదో ఒక స్టేషన్‌కు బదిలీ అయివుంటే పెద్దగా చర్చ నడిచేదికాదు. కానీ ఇద్దరికీ ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గురించే ఏవేవో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎస్బీ సీఐ ఎన్.భాస్కర్‌ను ఏకంగా కర్నూల్ రేంజ్ వేకెంట్ రిజర్వుకు (వీఆర్), ఎంటీఓ జి.భాస్కర్‌ను మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆద్యంతం వివాదాస్పదం..
ఎంటీఓ.. జిల్లా పోలీసుశాఖలో పెద్దగా ప్రాధాన్యత లేని పోస్టనే చెప్పాలి. పోలీసుశాఖలోని వాహనాల పర్యవేక్షణ, వీటికి ఉపయోగించే ఇంధనం, పోలీసు వాహనాలకు డ్రైవర్ల కేటాయింపు వంటి పనులను చూసుకుంటే సరిపోతుంది. కానీ ఇపుడా పరిస్థితి లేదు. ఎంటీఓ అంటేనే పోలీసు ఉన్నతాధికారిని కాకా పట్టడం, ఏయే సబ్-డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎవర్ని కలుస్తున్నాడు..? ఎస్ఐ సెలవు పెట్టి ఎక్కడికి వెళుతున్నాడు..? డీఎస్పీ పనితీరు ఎలా ఉంది..? లాంటి విషయాలపై ఉన్నతాధికారులకు చాడీలు చెప్పడం, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిపై ఆరోపణలు చేయడం, యూనియన్ నాయకులపై పెత్తనం చెలాయించడం లాంటి పనులపైనే దృష్టి పెడుతున్నారు. తల్లిలాంటి ఏఆర్ విభాగంలో ఏఎస్పీల నుంచి డీఎస్పీలు, తోటి ఆర్ఐలు ఉన్నతాధికారులనే ఎదిరించే స్థాయికి వెళ్లిపోయారు. ఇక ఏఆర్ అధికారులు వాహనాలు అడిగితే అమర్యాదగా మాట్లాడడం, పైగా చోరీ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను తన వద్దకు తెప్పించుకోవడం, కుటుంబ సభ్యుల్ని అందులో ఎక్కించుకుని రోడ్లపై తిరుగుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వీటిపై ఏఆర్‌తోపాటు లా అండ్ ఆర్డర్ నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తినట్టు సమాచారం. ఇదికాదన్నట్లు మొత్తం ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) విభాగం తన కనుసన్నల్లోనే పని చేయాలన్నట్లు 'సూపర్ బాస్'గా చెలామణీ అవుతూ ఓ వెలుగు వెలిగిన సందర్భం.

ఎస్పీపై కోపమే కారణమా?



చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో బదిలీలు అంటే 'బాస్' కల్పించుకుంటే తప్ప జరగదు. అలాంటిది బాస్‌కు చెప్పా పెట్టకుండా ఓ సీఐ స్థాయి అధికారికి ఇక్కడి నుంచి తప్పించడం, అదే బాస్‌కు నీడలా నడిచిన ఎంటీఓపై బదిలీ వేటు వేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనికితోడు 'ప్రత్యేక విభాగం'లో పనిచేసే మరో అధికారి ఇతర జిల్లాలో పనిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. చిత్తూరు ఎస్పీ మణికంఠ కొన్ని విషయాల్లో ముక్కుసూటిగా ప్రవర్తించడం పలువురు అధికారపార్టీ ఎమ్మెల్యేలకు నచ్చడం లేదు. ఈయన్ని బదిలీ చేయాలని కూటమి నేతలు బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఒకరు జూన్‌లో ఎస్పీ బదిలీ అవుతారంటే, 15 రోజుల్లో వెళ్లిపోతారని మరొకరు ప్రచారం చేస్తున్నారు. ముందు ఎస్పీ మార్కు వేసుకున్న అధికారులను ఇప్పటి నుంచే తప్పించడానికి కూటమి నేతలు కంకణం కట్టుకున్నట్లు పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది.

దారి తప్పిన ఎస్‌బీ..



ఇక పోలీసుశాఖలో ఎస్పీ తరువాత కీలకమైన విభాగం స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ). జిల్లాలో స్టేషన్ల పనితీరు ఎలా ఉంది.? ఎక్కడ ఎలాంటి సమస్యలున్నాయి? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లు ఎవరు..? రాజకీయ నాయకులతో సమస్యలొస్తే తీసుకునే చర్యలపై ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయనే విషయాలను ఎప్పటికప్పుడు ఎస్పీకి చేరవేయడమే ఎస్పీ ప్రధాన కర్తవ్యం. కానీ ఇటీవల కాలంలో పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో అధికారపార్టీ నేతలు నిర్వహిస్తున్న పేకాట క్లబ్బుల్లో వాటాలు, అక్రమ గ్రానైట్ తరలింపులో మామూళ్లు, కబేళాలకు తరలించే పశువుల లారీల్లో చిలక్కొట్టుడు లాంటి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ రెండు నియోజకవర్గాల్లో ఏం జరిగినా కుర్చీ వేసుకుని మరీ కూర్చుని వేలు పెడుతున్నారని, ఎస్‌బీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కూటమి పార్టీ ఎమ్మెల్యే బంధువును అక్కడి నుంచి తప్పించి.. తన అనుచరుడికి పోస్టింగ్ ఇప్పించారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఓ దశలో ఎస్‌బీ కూడా 'సూపర్‌బాస్'గా వ్యవహరించడం చాలా మంది అధికారులకు మింగుడుపడలేదు. వీటిపై ఏకంగా అధికారపార్టీ ఎమ్మెల్యే డీఐజీకి ఫిర్యాదు చేయడంతో వేటుపడినట్లు సమాచారం.

జిల్లాలో ముమ్మర తనిఖీలు
101 కేసుల నమోదు


చిత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ మణికంఠ చిత్తూరు నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు. రోడ్లపై తిరుగుతున్న వాహనాలను సైతం తనిఖీ చేశారు. ప్రజల భద్రతను మెరుగుపరచి, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో 1,781 వాహనాలను తనిఖీ చేయగా, నిబంధనలు పాటించని 101 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 9 మందిపై, చౌడేపల్లెలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు పెట్టారు. పెద్దపంజాణిలో సరైన బిల్లులేకుండా సరఫరా చేస్తున్న 10 వేల లీటర్ల డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా
చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌ను జూలై 5వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు సహకరించాలని కోరారు.

ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయండి
చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని డీఎం అండ్‌హెచ్ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో చాలా పీహెచ్‌సీల పరిధిలో ఎన్‌సీడీ సర్వే చేయడంలో సిబ్బంది అలసత్వం వహిస్తున్నారన్నారు. ఎందుకంతా నిర్లక్ష్యమని, సర్వే త్వరితగతినగా పూర్తి చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆర్‌సీహెచ్‌ఐడీ, అభ ఐడీకి అనుసంధాన ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఆమె సూచించారు.

అక్రమ సోదాలు అన్యాయం





చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, పుంగనూరులో తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏపీడబ్ల్యూజేఎఫ్ ధర్నా
- జిల్లావ్యాప్తంగా పాత్రికేయుల ఆందోళనలు

చిత్తూరు కలెక్టరేట్ : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు అక్రమ సోదాలు అన్యాయమని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి ప్రకాష్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా పలు పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధానాలు ప్రస్తుతం అమలు చేయడం దారుణమన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు జయరాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కలంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ఆ విషయం తెలిసనప్పటికీ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పరిమితులను దాటి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తాజాగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఏకపక్షంగా సోదాలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘ నాయకులు కృపానందరెడ్డి, యాదవేంద్రరెడ్డి, హరిప్రసాద్, కేశవులు, బాలసుబ్రహ్మణ్యం, ఉమాశంకర్, కుపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు అనైతికం
పుంగనూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారిందని, ఇది అనైతికమని పాత్రికేయులు ఆరోపించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమ తనిఖీలను ఖండిస్తూ శుక్రవారం పుంగనూరులో ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ లోపాలను సాక్షి దినపత్రికలో ప్రచురిస్తుండడాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సోదాలు చేయడం బాధకరమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించడమే ధ్యేయంగా జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సైపుల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎస్.రసూల్, మల్రిబాబు, కోటా రెడ్డి ప్రసాద్, జగదీష్, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, జావీద్, పురుషోత్తం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు మానుకోవాలి
చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై దాడులు మానుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు నాగరాజ, రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు చేయడం తగదన్నారు. జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ భార్గవికు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రసూల్, సుబ్రమణ్యం సింగ్, మురళి, హరిప్రసాద్, శ్రీనివాసులు, చిన్నా, రమేష్, వెంకటేష్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


చౌడేపల్లె: వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దర్శన సేవల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆలయ ఈఓ పెంచలకిషోర్ హెచ్చరించారు. వరసి ద్ధి వినాయకస్వా మి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం అన్ని విభా గాల అధికారులు, సిబ్బంది, అర్చకులతో ఆయన సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరూ అ కింత భావంతో పనిచేయాలన్నారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. దర్శ నార్థం సిబ్బందికి ఎవరైనా తెలిసిన వ్యక్తులు వస్తే కచ్చితంగా టికెట్లు తీసుకోవాలన్నా రు. దర్శన విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు ఉంటాయన్నా రు. ఆలయ ఆదాయ పెంపు విషయంలో ప్రతి ఒక్కరూ దేవస్థానానికి సహకరించాలన్నారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ ప్రసాద్, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

ఇక బయోమెట్రిక్‌తో పత్రాల అందజేత
చిత్తూరు కార్పొరేషన్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇక బయోమెట్రిక్ అయ్యాక ఇవ్వాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ హరినారాయణన్ మురుగన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాక్షిగా బయోమెట్రిక్ పెట్టిన వారికి తతంగం ముగిశాక బయోమెట్రిక్ పెట్టించుకుని పత్రాలు అందజేసేవారు. ప్రస్తుతం అలా కాకుండా క్రయ, విక్రయదారుల్లో ఎవరైనా ఒకరు కచ్చితంగా బయోమెట్రిక్ పెడితేనే పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో సబ్‌రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పటిష్టంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ ఆర్జేడీ, డీఐఈఓ శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరీక్షలకు 15,377 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు, పరీక్షల నిర్వహణ చాలా ముఖ్యమైనవన్నారు. పరీక్షల నిర్వహణలో అనుభవం ఎంతో నేర్పిస్తుందన్నారు.


మాట్లాడుతున్న చిత్తూరు డీఐఈఓ శ్రీనివాసులు

ద్విచక్ర వాహనాల్లో ప్రశ్నపత్రాలు తీసుకెళ్లవద్దు
ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాల్లో తీసుకెళ్లకూడదని పరీక్షల డీఈసీ కన్వీనర్ దయానందరాజు వెల్లడించారు. చెడ్డపేరు తెచ్చుకోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణ విధులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది పరీక్షల నిర్వహణ తీరు ఒకటే అయినప్పటికీ కొత్త కొత్త నిబంధనలు వస్తుంటాయని చెప్పారు. పరీక్ష కేంద్రంలో చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులే బాస్‌లని తెలిపారు. విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థినీ తనిఖీ చేసిలోనికి పంపాలన్నారు. ప్రాంగణంలో చిట్టీలు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పోలీసులు గేట్ లోపల సెల్‌ఫోన్ వినియోగించకూడదని తెలిపారు.

సెట్ పరిశీలనలో జాగ్రత్తలు ముఖ్యం
ఏ రోజుకు ఆరోజు ఉన్నతాధికారులు సూచించే ప్రశ్నపత్రాల సెట్ విషయంలో అత్యంత జాగ్రత్తలు వహించాలని డీఈసీ సభ్యుడు శరత్ చంద్ర అన్నారు. పరీక్షల నిర్వహణలో చెక్‌లిస్ట్‌ను అనుసరించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ముందుగా చేరుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లేటప్పుడు సెట్ నంబర్లను జాగ్రత్తగా పరిశీలించుకుని తీసుకెళ్లాలన్నారు. ప్రశ్నపత్రాలు తక్కువ రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రాలు ఇచ్చే సమయంలో మీడియం విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అన్నదానం, గోసంరక్షణ ట్రస్టులకు విరాళాలు


విరాళం అందజేస్తున్న దాతల కుటుంబసభ్యులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని అన్నదానం, గోంసంరక్షణ ట్రస్టులకు శుక్రవారం దాత కుటుంబాలు నగదు విరాళం చేశాయి. హైదరాబాద్‌కు చెందిన దాత బాలాజీ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు మొత్తం రూ.1.73 లక్షలు నగదు విరాళం ఇచ్చారు. ఇందులో అన్నదాన ట్రస్టుకు రూ.62వేలు, గోసంరక్షణ ట్రస్టుకి రూ.1.11 లక్షల చొప్పున్న అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సత్య నారాయణ రమాదేవి కుటుంబసభ్యులు గోసంరక్షణ ట్రస్టుకు రూ.50వేలు, నిత్యాన్నదానం ట్రస్ట్కకు రూ.50 వేలు మొత్తం రూ. ఒక లక్ష విరాళం ఇచ్చారు. ఈ నగదును అందుకున్న ఆలయ ఏఈఓ రవీంద్రబాబు వారికి స్వామి వారి దర్శనం కల్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందికి రూ.లక్ష జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పరిశ్రమల స్థాపనకు భూముల పరిశీలన

శాంతిపురం: రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో ప్రతిపాదిత విమానాశ్రయ సమీపంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు శుక్రవారం భూములను పరిశీలించారు. అడిడాస్, నైక్ కంపెనీల ప్రతినిధులు దండికుప్పం, అమ్మవారిపేట, విజలాపురం, మణీంద్రం, కిలాకిపోడు ప్రాంతాల్లో పర్యటించారు. కడా ప్రాజెక్టు ఆఫీసర్ వికాస్ మర్మత్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, శాంతిపురం తహసీల్దార్ శివయ్య కంపెనీల ప్రతినిధులను తీసుకువచ్చి భూములను చూపారు. అందుబాటులోని భూములు, సేకరించనున్న భూముల వివరాలను అధికారులు పారిశ్రామిక ప్రతినిధులకు వివరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

చైర్మన్ గిరి.. వరించేదెవరినో?

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి ఆశావహులను ఊరిస్తోంది. ఎవరికి వారు తమకే పదవి వస్తుందని, ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. కూటమి సర్కారు మాత్రం ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తోంది. దీంతో ఆ కుర్చీ ఎవరికి దక్కుతుందోనని ద్వితీయ శ్రేణి కూటమి నేతలు వేచి చూస్తున్నారు.

- కాణిపాకం పాలకమండలి ఏర్పాటులో జాప్యం?
- అదిగో..ఇదిగో అంటూ నాన్చుతున్న ప్రభుత్వం
- నలుగురి మధ్య తీవ్ర పోటీ
- ఆశావహుల్లో ఉత్కంఠ

కాణిపాకం: అతిపెద్ద ఆలయాల్లో ఒకటైనా వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో అర్థం కాని పరిస్థితి. పాలకమండలి ప్రకటించే విషయంలో అదిగో..ఇదిగో అంటూ ప్రభుత్వం నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తోంది. ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి కోసం నలుగురు పోటీ పడుతున్నారు. మాజీ చైర్మన్‌కు మళ్లీ పట్టమంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఆర్థికంగా మంచి పలుకుబడి ఉన్నవాళ్లకే ఇస్తే ఆలయాభివృద్ధికి దోహద పడతారనే వాదనలు మరోవైపు గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్తగా ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలనే యోచనలో అధిష్టానం ఉన్నట్లు చర్చ జోరుగా సాగుతోంది. దీంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.


కాణిపాక దేవస్థానం

చతుర్ముఖ పోటీ

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి వరకు ఉన్న పాలక వర్గం రాజీనామా చేసింది. అప్పటి నుంచి కొత్త పాలక వర్గం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తోంది. అయితే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, కూటమి నేతలు పూర్ణచంద్ర, మధుసూదన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కుర్చీ కోసం పోటీపడుతున్నారు. ఈ తరుణంలో మళ్లీ తానే చైర్మన్ అంటూ మణినాయుడు బహిరంగంగానే అందరికీ చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, కొందరు నేతల మద్దతు ఉండడంతో మణినాయుడుకే చైర్మన్ పదవి ఇస్తారని చెబుతున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం చైర్మన్ మణినాయుడుకే ఇవ్వాలని కొందరు ప్రతిపాదించారు. అయితే అధిష్టానం ఒక్క మణినాయుడు పేరు కాదు.. ఆయనతోపాటు మరో ముగ్గురు, నలుగురు పేర్లు ఇవ్వాలని చెప్పింది. దీంతో ఆ నలుగురి పేర్లను తెరపైకి తీసుకొచ్చారు. ఆ నలుగురిలో మణినాయుడు తరువాత చైర్మన్ పదవి కోసం పూర్ణ గట్టిగా పోటీపడుతున్నారు. ఇప్పుడు ఎవరికి ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.


మణినాయుడు, పూర్ణచంద్ర, మధుసూదన్, లత

ఆలస్యం వెనుక ఆంతర్యమేమిటో?

కాణిపాకం దేవస్థాన చైర్మన్ పదవి ప్రకటన విషయంలో ఆలస్యం జరుగుతోంది. ఆలస్యం వెనుక ఆంతర్యం ఏమిటోనని ఆశావాహులు, ఉభయకర్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ మణినాయుడికి ఇస్తారా? ఇవ్వరా అనే అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. మరో ముగ్గురిలో ఆర్థికంగా మంచి పలుకుబడి ఉన్న వ్యక్తులకు ఇస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. ఇక కొత్తగా ఎస్సీ సామాజిక వర్గానికి కట్టబెడతారని మరోవైపు ప్రచారం జరుగుతోంది. ఎప్పటి నుంచో ఉన్న ఈ ప్రతిపాదనను అధిష్టానం పరిశీలనలో పెట్టినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ప్రజాప్రతినిధి కూడా సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది నిజం కాదని.. ఇక్కడ ఎస్సీ సామాజిక వర్గం మాటే ఉండదని పలువురు ఈ ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు. ఈ గందరగోళం నడుమ స్థానికంగా ఉన్న వ్యక్తిని కాదని బయట వ్యక్తులకు ఇస్తారని కొందరు చెబుతున్నారు. కాగా ఇప్పటి వరకు జిల్లాలో కేటాయించిన పలు నామినేటెడ్ పదవులు ఆశావహులకు కాకుండా ఊహించని వ్యక్తుల ఇవ్వడం కూడా కాణిపాకం చైర్మన్ పదవి ఆశిస్తున్న ఆశావహుల్లో గుబులు పుట్టిస్తోంది.

తక్షణం పీఆర్సీ కమిషన్ వేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ 1947 జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు తమ డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. జీఓ 117 కు ప్రత్యామ్నాంగా తీసుకొచ్చిన 9 రకాల పాఠశాలలు గందరగోళంగా ఉన్నాయన్నారు. పాత విధానంలో 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక పాఠశాలలు, 1 నుంచి 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 నుంచి 10 ఉన్నత పాఠశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 12 వ వేతన సవరణ కమిషన్ వెంటనే ఏర్పాటు చేసి, మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం టీచర్ల డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, చంద్రన్, జగదీష్, మధు, తులసి, అప్జల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలన అధ్వాన్నం

- కుప్పం ద్రవిడ వర్సిటీలో ఏడాదిగా జీతాలు ఇవ్వలేదు
- టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై బాబు స్పందించాలి
- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్


నిరసనలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలన బాగా లేదని, ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీలో ఏడాదిగా జీతాలు ఇవ్వలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఆయన టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా టీటీడీ పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో 30 సార్లుకు పైగా ఆందోళనలు చేపట్టామన్నారు. టీటీడీలో పని చేసే అర్చకులు, శాశ్వత ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అలిపిరి నుంచి పేరూరు వరకు 400 ఎకరాలు టీటీడీ భూములున్నాయని, ఆ భూముల్లో ఒక్కొక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తిరుమల కొండకు ఎన్నోసార్లు వచ్చి వెళ్లారని, అయితే కొండపై సుమారు 500 దుకాణాలున్నా వాటిలో ఒక్కరైనా ఎస్సీ, ఎస్టీ ఉన్నారా? అని ప్రశ్నించారు. జనాభా నిష్పత్తి ప్రకారం 500 దుకాణాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. అలాగే టీటీడీలో పనిచేసే ఎస్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ద్రవిడ వర్సిటీలో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, ఎస్వీయూలో ప్రొఫెసర్లకు కూడా మూడు నెలలుగా జీతాలు అందలేదన్నారు. ఉద్యోగులకు నెల నెలా సక్రమంగా జీతాలు ఇవ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. శ్రీసిటీని కాంగ్రెస్ పార్టీ తెచ్చిందని, 250 కంపెనీలు ఏర్పాటు చేశామని, వేల మందికి ఉద్యోగాలు తామే ఇచ్చామని తెలిపారు. నిన్న ఒక మంత్రి శ్రీసిటీకి వచ్చి వెళ్లారని, ఆయన పర్యటన గురించి ఢంకా బజాయించుకుంటూ పేపర్లో గొప్పగా కథనాలు రాయించుకున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లకు పసుపు రంగు వేయించడం దౌర్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, వెంకటేష్, ముని శోభ, తేజోవతి, కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలెక్టర్ చర్చలు


కడా కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

- గోడు విన్నవించుకున్న రైతులు
- న్యాయం చేస్తామన్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం: రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు ఇవ్వమని ఆందోళన వ్యక్తం చేసిన రైతులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చర్చలు జరిపారు. శుక్రవారం కడా పీడీ కార్యాలయంలో రామకుప్పం, శాంతిపురం మండల్లోని అమ్మారిపేట, 30-సొన్నేగానిపల్లి, దండికుప్పం, కిలాకిపోడు, మణీంద్రం, బందలగుట్ట, కడచినకుప్పం, విజలాపురం గ్రామాల్లోని రైతులతో చర్చించారు. గతంలో విమానాశ్రయం కోసం ప్రభుత్వం ఇప్పటికే భూములు తీసుకుందని, ఉన్న కొద్దోగొప్పో భూములను ఇండస్ట్రియల్ పార్కు కోసం తీసుకుంటే తమ జీవనం దుర్భరమైపోతుందని కలెక్టర్‌తో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకందరికీ ఎకరా, 50 సెంట్లు పొలం మాత్రమే ఉందని, ఆ పొలంలో పశుగ్రాసం సాగుతో పాడి పరిశ్రమ ద్వారా జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ప్రభుత్వం పరిశ్రమల కోసం ఉన్న కొంత భూమిని కూడా లాక్కుంటే తమ జీవనం కష్టతరమవుతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పరిశ్రమలు రావడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, రైతులు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. భూములు నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని, కోల్పోయిన భూములకు మెరుగైన నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తూ తమ భూములు ఇవ్వలేమని చెప్పినట్లు సమాచారం. ప్రత్యేకంగా ప్రతి రైతుతో చర్చించి, సర్దుబాటు చేస్తామంటూ కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.

విమానాశ్రయ భద్రతపై సమీక్ష



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఇండియా–పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో శుక్రవారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి విమానాశ్రయ అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం అమలు చేస్తున్న భద్రతా చర్యలపై, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన భద్రతా విషయాలపై చర్చించారు.

12న డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన


డీఆర్వోకు ముందస్తు నోటీసు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు


చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 12వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు నిరసన కార్యక్రమానికి సంబంధించి ముందస్తు నోటీసును శుక్రవారం డీఆర్వో మోహన్‌కుమార్, డీఈఓ వరలక్ష్మికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ, ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండానే రోజుకో వింత ఆలోచనలతో ఉపాధ్యాయుల సర్దుబాటు తీవ్ర ఆందోళనకు లోను చేస్తోందన్నారు. వారం వారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సమావేశాల్లో సమస్యలు వెల్లడిస్తున్నా ఏ మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల్లో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సమస్యలు చెలరేగుతున్నాయన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల సమస్యలు పరిష్కరించాలని పదే పదే చెబుతున్నా ఏ మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనను గమనించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, గౌరవాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు రెడ్డెప్పనాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


యానాది రెడ్డెప్ప మృతదేహం

చౌడేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం పుంగనూరు మార్గంలోని చిన్న యల్లకుంట్ల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చౌడేపల్లె మండలం పాదలపల్లె సమీపంలోని ఓ రైతుకు చెందిన మామిడితోటకు యానాది రెడ్డెప్ప(35) కాపలాగా ఉన్నాడు. అతనికి భార్య రాజేశ్వరి, ఐదుగురు పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి పెద్దయల్లకుంట్ల సమీపంలోని ఓ మామిడితోటలో కాపలాగా ఉన్న తన అక్క సిద్ధమ్మ వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న భార్యాపిల్లలతో కలిసి గురువారం రాత్రి భోజనం చేసి, తాను కాపలా ఉన్న మామిడితోట వద్దకు వెళ్లేందుకు రెడ్డెప్ప చౌడేపల్లె- పుంగనూరు మార్గంలోని పాదలపల్లె సమీపంలో రోడ్డుపైకి వచ్చాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని వాహనం ఈడ్చుకుని వెళ్లి, కొద్ది దూరంలోని పొదల చాటున పొలాల్లోకి పడేసి ఉడాయించారు. అటు వైపుగా వెళ్లే పాదచారులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

శ్రీరంగరాజపురం : అదుపుతప్పి ఆయిల్ ప్యాకెట్లు తరలిస్తున్న లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని గంగమ్మగుడి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి చిత్తూరుకు ఆయిల్ ప్యాకెట్ల లోడ్‌తో శుక్రవారం ఓ లారీ బయలుదేరింది. లారీ చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని శ్రీరంగరాజపురం మండలం ఆరిమాను గ్రామానికి సమీపంలోని గంగమ్మ గుడి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

జూద స్థావరాలపై దాడులు

9 మంది జూదరుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వెదురుకుప్పం : జూదస్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి, 9 మంది జూదరులను అరెస్టు చేసిన సంఘటన మండలంలోని జక్కదొన అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని జక్కదొన అటవీ ప్రాంతంలో కొంతమంది జూదం ఆడుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలసి జూద స్థావరాలపై మెరుపు దాడులు చేశారు. ఆ సమయంలో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి, రూ.15,830 స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సుమన్ తెలిపారు. ఎవరైన జూదం ఆడినా, సారా కాసినా కఠిన చర్యలు తప్పవని అన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్త దాడి


గాయపడిన సుందరయ్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్త దాడులు చేశాడు. పాత కక్షలతో ఇంటి అరుగుపై కూర్చున్న వ్యక్తిపై బులెట్ లో దూసుకెళ్లి, గుద్ది గాయ పరిచాడు. ఆపై కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేసి, చితకబాది భయ భ్రాంతులకు గురి చేసిన ఘటన చిత్తూరు మండలం 36.గొల్లపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చిత్తూరు మండలం 36.గొల్లపల్లికి చెందిన సుందరయ్య తన ఇంటి అరుగుపై కూర్చుని ఉన్నారు. ఇది గమనించిన టీడీపీకి చెందిన పవన్ బులెట్ పై అతివేగంగా అతని పైకి దూసుకొచ్చాడు. దీంతో సుందరయ్యకు గాయాలయ్యాయి. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆ యువకుడిని ఇంటికి తీసుకెళ్లారు. మళ్లీ ఆ యువకుడు సుందరయ్య మామ వజ్రాలు మండడి వీపుపై ఇనుప వస్తువుతో చితకబాదాడు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రిలో చేరారు. మళ్లీ ఆ యువకుడు చిత్తూరులోని కొందరు అల్లరి మూకలను రప్పించి, బాధితుడి ఇంట్లోని మహిళలు, వృద్ధులపై దాడి చేశాడు. ఆ కుటుంబం ఎప్పుడు ఏం చేస్తారని భయపడుతోంది. కాగా నిందితుడు ఎన్నికల సమయంలో కూడా ఓ వ్యక్తిపై దాడిచేసి తలపై గాయపరిచాడు. దీనిపై కేసు కూడా నమోదైంది

క్రీడా సామగ్రి అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడా సామగ్రి అందజేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనే విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 48 క్రీడా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి క్యాంపునకు రూ.5500 విలువ చేసే క్రీడా సామగ్రి అందజేశామన్నారు. అనంతరం శిక్షణ క్యాంపులు నిర్వహిస్తున్న పీడీ, పీఈటీలకు అతిథుల చేతుల మీదుగా క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెంగల్రాయనాయుడు, ఉపాధ్యక్షులు జయప్రకాష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిరోధించాలి


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : బాల్య వివాహలను నిరోధించాలని 8వ డివిజన్ సచివాలయ మహిళా పోలీసు సునీత అన్నారు. శుక్రవారం నగరంలోని వెంగళరావు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయసు బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మేనరికాలు, ఆచారాల పేరుతో బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసి బాలికల జీవితాలను బుగ్గిపాలు చేయకూడదన్నారు. ప్రేమ పేరుతో మోసగించడం, నమ్మి వెంట వచ్చిన వారిని చిత్రహింసలు పెట్టడం, బాలికల ప్రాణాలకు ముప్పు కలిగేలా వ్యవహరించడం నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలని చెప్పారు. బాలికలు తమకు తాము కాపాడుకునేలా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా భయాందోళన చెందకూడదన్నారు. బాలికలు కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిలకు

వేసవి సెలవులు

- 12 రోజుల వంతున లీవుకు అవకాశం
- జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఈనెల 19 నుంచి జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులు ఉండడంతో జడ్జిలు వేసవి సెలవులపై వెళ్లడానికి 12 రోజులు చొప్పున సెలవులు మంజూరు చేస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు చిత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.మాధవి, చిత్తూరు మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీ.శిరీషా, చిత్తూరు 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.వెన్నెల, చిత్తూరు ఎక్సైజ్ కోర్టు జడ్జి వీ.శిల్ప, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీ.సుభాన్, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీ.వాణిశ్రీ, తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.కోటేశ్వరరావు, తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, శ్రీకాళహస్తి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే.కృష్ణవంశీ, పుత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కే.రమ్యసాయి, వాయల్పాడు జూనియర్ సివిల్ జడ్జి గురుఅరవింద్, సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి ఏ.వెంకటనాగరాజు సెలవుపై వెళ్లనున్నారు. అలాగే జూన్ ఒకటి నుంచి 12వ తేదీ వరకు చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డీ.ఉమాదేవి, చిత్తూరు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, మదనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే.కీర్తన, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్, తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. సంధ్యారాణి, తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధిశ్రీనివాస్, పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీ.జానకి, తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఉమర్ ఫరూక్, పాకాల జూనియర్ సివిల్ జడ్జి పీ. పూర్ణిమాదేవి, పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత్, కుప్పం జూనియర్ సివిల్ జడ్జి పీ.వరుణ్ తేజ్ సెలవు పై వెళ్లడానికి జిల్లా కోర్టు అనుమతిచ్చింది.